క్లుప్తంగా

పలువురు పండితులకు సత్కారం



ఆత్మీయ హితకారిణీ సమాజంలో పండితులను సత్కరించిన దృశ్యం

కొవ్వూరు: పట్టణంలోని ఆత్మీయ హితకారిణీ సమాజం వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జ్ఞాన సరస్వతి ఆలయంలో కవి, పండితులకు పురస్కారాలు అందజేసి సత్కరించారు. పితృ కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాటు చేసిన భూసర పితృ యాజ్ఞ వేదికను బుద్ధవరపు సుబ్బారావు ప్రారంభించారు. పండితులు అమరేశం రాజేశ్వరశర్మ, బర్రేపూడి సుబ్బారావు, నోరి భోగేశ్వరరావు, జీబీవీ సుబ్రహ్మణ్యం, కస్తూరి కాంతారావు, మేడూరి ప్రసాద్, ఎస్ఎస్ వాజ్‌పేయ్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యత పరిశీలన

నిడదవోలు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన గుణాత్మక విద్య అందించాలని ఎంఈఓ కిషోర్‌కుమార్ ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని పందలపర్రు గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును బుధవారం ఎంఈఓ పరిశీలించారు. విద్యార్థుల నోట్ పుస్తకాలు, వర్క్‌బుక్స్‌తో పాటి వారి సామర్థ్యాలను పరిశీలించారు. సీఆర్పీలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

అందరికీ ఆమోదయోగ్యమైన కమిటీ వేయాలి

తాళ్లపూడి: తాళ్లపూడి గ్రామదేవత మోదుగులమ్మ జాతర నిర్వహణకు వారసత్వంగా వస్తున్న కుటుంబాలను కాదని, ఇష్టమైన వారితో రహస్యంగా కమిటీ వేయడం తగదని ఉప సర్పంచ్ గోలి అన్నవరం, గ్రామస్తులు వనిమిరెడ్డి శ్రీను, మైగాపుల ఆంజనేయులు తదితరులు ఆరోపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమిటీలో గోలి కుటుంబానికి చోటు కల్పించలేదన్నారు. గ్రామంలో వివాదాలకు తావు లేకుండా అందరికి ఆమోదయోగ్యమైన కమిటీ వేయాలని కోరారు. సమావేశంలో గోలి సాయి, మైగాపుల రత్నాజీ, డీవీ. శివ, మణికంఠ, దూడల సత్తిబాబు, మైగాపుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చేతిరాతపై దూబచర్లలో వర్క్ షాపు



చేతి రాత వర్క్ షాపులో పాల్గొన్న విద్యార్థులు

నల్లజర్ల: చేతిరాత అకాడమీ, దూబచర్ల లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఇండియన్ హ్యాండ్ రైటింగ్ అకాడమీ డైరక్టర్ సీహెచ్ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం దూబచర్ల గ్రామంలోని సంఘమిత్ర స్కూల్ ఆవరణలో వర్క్ షాపు నిర్వహించారు. నెల రోజులు పాటు జరిగే ఈ కార్యక్రమంలో విద్యార్థులకు చేతిరాతపై శిక్షణ ఇస్తారని ఆయన చెప్పారు. అనంతరం వారికి పోటీలు నిర్వహించే బెస్ట్‌గా హ్యాండ్ రైటింగ్ రాసే వారికి బహుమతులు అందిస్తామని పవన్‌కుమార్ తెలిపారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు అంబటి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థుల జీవితంలో చేతిరాతే చాలాప్రాముఖ్యమన్నారు.మంచిచేతిరాతతో అధికమార్కులు సాధించవచ్చునన్నారు.మంచి చేతిరాతతో ఎదుటవారిని ఇట్టే ఆకట్టుకోవచ్చునన్నారు.యోగాగురువు రాజారావు తదితరులు పాల్గొన్నారు.

రాగోలపల్లిలో కలప ట్రాక్టర్ స్వాధీనం

తాళ్లపూడి: ఆలయ స్థలంలోని చెట్లను నరికి, కలపను తరలిస్తున్న ట్రాక్టర్‌ను మండలంలోని రాగోలపల్లి వాసులు బుధవారం పట్టుకున్నారు. వివరాలివి. రాగోలపల్లి మెట్ట మీద గల సుబ్రహ్మణ్య స్వామి ఆలయ స్థలాలను కొందరు ఆక్రమించడంతో పాటు, అక్కడి చెట్లను నరికి తరలించి వేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో కలప తరలిస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం వారు పట్టుకుని పంచాయతీ అధికారులకు అప్పగించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన నీరుకొండ రమేష్, చలపాటి ప్రకాష్, కాండ్రు మహేష్ తదితరులు మాట్లాడుతూ గతం నుంచీ అక్రమార్కులు కొండను ఆక్రమించుకుంటున్నారన్నారు. సుమారు ఏడెకరాల కొండకు ఫెన్సింగ్ వేసినప్పటికీ కూడా వారు కలపను దొంగిలిస్తున్నారని ఆరోపించారు. దీనిపై చర్యలు తీసుకోవాలని అధికారులను వారు డిమాండ్ చేశారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి రామలక్ష్మి మాట్లాడుతూ కలప ట్రాక్టర్‌ను తాళ్లపూడి పోలీసులకు అప్పగించామన్నారు.

బస్ కాంప్లెక్స్‌లో అగ్ని ప్రమాదం

దేవరపల్లి: యర్నగూడెం బస్ కాంప్లెక్స్‌లోని దుకాణాల్లో మంగళవారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. ఇక్కడి శ్రీహాస్ టెక్నాలజీ షాపులో మంటలు చెలరేగడంతో కంప్యూటర్లు, ఐ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ఇతర విలువైన ఎల్రక్టానిక్ పరికరాలు దగ్ధమైనట్టు యజమాని నల్లం సుభాష్ తెలిపారు. నష్టం విలువ అంచనా వేస్తున్నారు.

దివ్యాంగులకు భవిత

- మండలానికో కేంద్రం
- ఉచితంగా పరికరాల పంపిణీ
- గృహస్థాయిలో ఫిజియోథెరపీ



దివ్యాంగ పిల్లలకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు

చాగల్లు: ప్రత్యేక అవసరాలు గల పిల్లలపై ప్రభుత్వం దృష్టి సారించింది. సాధారణ పిల్లలతో కలసి వారు సాగేలా చర్యలు చేపడుతోంది. గృహస్థాయిలో ఫిజియోథెరపీ అందిస్తోంది. ఆర్థిక తోడ్పాటు కూడా కల్పిస్తూ దివ్యాంగుల భవితకు భరోసా ఇస్తోంది. ఇలాంటి చిన్నారుల వికాసానికి భవిత కేంద్రాల్లో ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టింది. ఆ కేంద్రాల్లో ప్రత్యేక వాతావరణం ఉండేలా చేస్తోంది. వారిలో దాగిన సృజనాత్మకతను వెలికితీస్తుంది. అందరి పిల్లలతో కలసి దివ్యాంగులు జీవనం సాగించేందుకు ఐఈఆర్టీలు ప్రత్యేక దృష్టి సారించేలా ఆదేశాలు జారీ చేసింది. కొవ్వూరు నియోజకవర్గంలో కొవ్వూరు, చాగల్లు, తాళ్లపూడి మండలాల పరిధిలో మూడు భవిత కేంద్రాలున్నాయి. నియోజకవర్గంలో మొత్తం 410 మంది ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు ఉన్నారు. మండలాల వారీగా చాగల్లులో 149, కొవ్వూరులో 172, తాళ్లపూడిలో 89 మంది ఉన్నారు. ఇందులో 67 మంది భవిత కేంద్రాలకు వస్తున్నారు. ఒక్కో భవిత కేంద్రంలో ఒక ఐఈఆర్టీ, ఆయాను నియమించారు. వారానికోసారి ఈ కేంద్రాలకు ఫిజియోథెరపిస్ట్ వచ్చి వారితో వ్యాయామం చేయిస్తారు. దీంతో పాటు వ్యాయామం ఎలా చేయించాలో వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు. ప్రతి శనివారం కదల్లేని వారి ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులకు పలు అంశాలను వివరిస్తారు.

అందుతున్న సేవలిలా...

విద్య, ఫిజియోథెరపీతో పాటు భవిత కేంద్రాలకు వచ్చే ప్రత్యేక అవసరాలు గల బాల బాలికలకు, ఇంట్లో ఉన్నవారికి నెలకు రూ.250 చొప్పున ఏడాదిలో పది నెలల పాటు ప్రభుత్వం అలవెన్సు అందిస్తోంది. బాలికలకు ప్రత్యేకంగా పది నెలల కాలానికి రూ.2,500 ఫండ్ రూపంలో ఇస్తున్నారు. మానసిక దివ్యాంగులకు రూ.7 వేల విలువైన ఎంఆర్ కిట్లను ప్రభుత్వం ఉచితంగా ఇస్తోంది. ఉచితంగా మధ్యాహ్న భోజనంతో పాటు బస్‌పాస్‌లు, వినికిడి యంత్రాలు, చక్రాల కుర్చీలు అందిస్తున్నారు.



చాగల్లు భవిత కేంద్రంలో దివ్యాంగ బాలుడికి ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యులు

మండలం	భవిత కేంద్రానికి వచ్చే పిల్లల సంఖ్య
చాగల్లు	21
కొవ్వూరు	26
తాళ్లపూడి	20

మార్పు తీసుకొచ్చేందుకు..



తల్లిదండ్రులు ప్రత్యేక అవసరాలు కలిగిన తమ పిల్లలను భవిత కేంద్రానికి తీసుకొచ్చేలా సేవల వివరాలు తెలుపుతున్నాం. క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ అందించి వారిలో మార్పు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నాం. భవిత కేంద్రాల్లో పిల్లలకు ప్రభుత్వపరంగా అందిస్తున్న ఉచిత పథకాలను గుర్తించి తెలియజేస్తున్నాం.

–వి.ఖాదర్‌బాబు, ఎంఈఓ, చాగల్లు

దివ్యాంగులపై ప్రత్యేక శ్రద్ధ



భవిత కేంద్రానికి వస్తున్న దివ్యాంగ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం. పిల్లల మనోభావాలను అనుసరించి వారికి పాఠాలు చెబుతున్నాం. ఆట పాటలతోనూ వారిలో మనోధైర్యాన్ని నింపేందుకు కృషి చేస్తున్నాం. వారిలోని ప్రతిభను వెలికితీసేందుకు శిక్షణ ఇస్తున్నాం.

–బి.రామచంద్రరావు, ప్రత్యేక ఉపాధ్యాయుడు, చాగల్లు

సీఎం జగన్‌కు వినతుల వెల్లువ

నిడదవోలు రూరల్: నిడదవోలు పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి వినతులు వెల్లువెత్తాయి. వివిధ సమస్యలపై ప్రజలు సీఎంను కలిసి వినతులు ఇచ్చారు. వాటిని పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ కె.మాధవీలత వెల్లడించారు.

- నిడదవోలు రాయిపేటకు చెందిన దివ్యాంగుడు వరిగేటు యేసురాజు తన భార్య దాసరి సునీత దివ్యాంగురాలని డిగ్రీ పూర్తి చేసి కంప్యూటర్‌లో నైపుణ్యం సాధించిందని, ఉద్యోగ అవకాశం కల్పించాలని సీఎంను కోరింది.
- గోపాలపురానికి చెందిన చల్లా వీర నాగరాజు ఉపాధి తన తల్లిదండ్రుల పోషణ నిమిత్తం ఉద్యోగం ఇప్పించాలని అర్జీ ఇచ్చారు.
- నిడదవోలు బాలాజీపేటకు చెందిన ఎం.శ్రీనివాసులు తనకు ప్రభుత్వ ఉద్యోగం ఉందన్న సాకుతో తన కుమార్తె ఎం.చంద్ర గారికి 9 నెలలుగా దివ్యాంగ పింఛను నిలిపేశారని, తిరిగి పునరుద్ధరించాలని కోరారు.
- నిడదవోలు, 4వ వార్డుకు చెందిన కుమారి సయ్యద్ గులాబీ తల్లికి ప్రభుత్వ పింఛను వస్తున కారణంగా తనకు దివ్యాంగ పింఛను ఆపేశారని, పునరుద్ధరించాలని కోరారు.
- బొమ్మూరుకు చెందిన తానింక దుర్గాదేవి తన భర్త హెచ్ఐవీ వల్ల మృతి చెందాడని, 14 ఏళ్ల ఏపీ ట్రాన్స్‌కోలో పనిచేశారన్నారు. అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా ప్రయోజనం కలగడం లేదన్నారు. తన బిడ్డను పోషించుకునేందుకు ఉద్యోగం ఇవ్వాలని కోరారు.
- పూర్వపు పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన కళాకారులు 2018–19లో జన్మభూమి కళా ప్రదర్శనలు నిర్వహించామని, ఆనాడు కళా ప్రదర్శనకు చెందిన పర్యాటక శాఖ, సాంస్కృతిక శాఖ నుంచి రావాల్సిన సాయం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆత్మీయ స్వాగతం అభివాదం





నిడదవోలులోని సెయింట్ ఆంబ్రోస్ స్కూల్ ఆవరణలో బుధవారం నిర్వహించిన తన కుమార్తె డాక్టర్ సామశ్రీ ,అల్లుడు డాక్టర్ శివతేజల వివాహ రిసెప్షన్‌కు హాజరైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆత్మీయ స్వాగతం పలుకుతున్న నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు. రెండో చిత్రంలో వేదికపై ప్రజలకు చేతులెత్తి అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి.

సీఎం జగన్ దృష్టికి నియోజకవర్గ సమస్యలు

దేవరపల్లి: నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడి కుమార్తె వివాహ రిసెప్షన్‌కు బుధవారం నిడదవోలు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు గన్నమని వెంకటేశ్వరరావు (జీవీ) మర్యాద పూర్వకంగా కలసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో జగనన్న కాలనీల నిర్మాణానికి ఆమోదం తెలపాలని, సొంతంగా ఇంటి స్థలం గల పేదలకు గృహాల మంజూరు చేయాలని, దేవరపల్లిలో ఆర్‌టీఓ కార్యాలయం ఏర్పాటు చేయాలని వారిద్దరూ జగన్‌మోహన్‌రెడ్డిని కోరారు.



సీఎం జగన్‌కు సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే తలారి, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు జీవీ

అర్బన్ హెల్త్ సెంటర్‌ను పరిశీలించిన డీఎంహెచ్‌వో

కొవ్వూరు: అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఓపీ సేవలను పెంచే అంశంపై వైద్యులు, సిబ్బంది దృష్టి సారించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి కె.వెంకటేశ్వరరావు సూచించారు. బుధవారం నిడదవోలు సీఎం పర్యటనకు విచ్చేసిన డీఎంహెచ్ఎం కొవ్వూరు క్రిస్టియన్‌పేటలోని యుహెచ్‌సీని సందర్శించారు.హెల్త్ సెంటర్ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. ప్రస్తుతం అమలులో ఉన్న కార్యక్రమాల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. వైద్యులు సుష్మ, బి.శ్రీనివాసరావు, డాక్టర్ సత్య, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



కొవ్వూరు అర్బన్ హెల్త్ సెంటర్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు

కంటి వెలుగు కార్యక్రమం పరిశీలన

చాగల్లు: కంటి వెలుగు కార్యక్రమం ద్వారా వృద్ధుల దృష్టి దోషాలను నయం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు సూచించారు. కలవలపల్లి గ్రామ సచివాలయం వద్ద నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన కలవలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, అక్కడ పరిస్థితులపై సంతృప్తి వ్యక్తం చేశారు.కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం. సౌజన్య, ఆప్తాల్మిక్ ఆఫీసర్ పెంటపాటి గురుస్వామి, ఆరోగ్య విస్తరణాధికారి అడపా కాటమరాజు, పీహెచ్ఎన్ ఎస్.పద్మావతి, ఆరోగ్య పర్యవేక్షకులు పాల్గొన్నారు.

వివేకానంద యువజన సమితి ఆధ్వర్యంలో సైన్స్‌ఫేర్

కొవ్వూరు: స్వామి వివేకానంద యువజన సమితి, సైంటిఫిక్ స్టూడెంట్స్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళ వారం రాత్రి స్థానిక సంస్కృత పాఠశాల ప్రాంగణంలో జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. జాతీయ అభివృద్ధిలో ఇస్రో పాత్ర అన్న అంశంపై ఇస్రో ఇంజినీర్ విష్ణువర్జుల రామమూర్తి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పలువురు విద్యార్థులు సృజనాత్మకంగా తయారు చేసి, ప్రదర్శించిన వివిధ సైన్స్ నమూనా ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.శాస్త్ర సాంకేతికత, పర్యావరణ సమతుల్యతపై చిత్ర లేఖనం, వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలు బహుమతులు అందజేశారు.స్వామి వివేకానంద యువజన సమితి కార్యదర్శి, ఫౌండర్ ఎస్.రాఘవేంద్రరావు, అధ్యక్షుడు దోర్బల ప్రభాకర శర్మ, సైంటిఫిక్ స్టూడెంట్ సొసైటీ ప్రతినిధి ఎస్‌జీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆంధ్ర గీర్వాణ విద్యా పీఠంలో చతుర్వేద హవనం

- నేడు కొవ్వూరుకు కంచి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి
- 3 నుంచి 7 వరకు త్రికాల పీఠ పూజాదికాలు
- 4న గోష్పాదక్షేత్రంలో శంకరాచార్య ఆరాధనోత్సవం

కొవ్వూరు: పట్టణంలోని ఆంధ్ర గీర్వాణ విద్యాపీఠం (సంస్కృత కళాశా)లో వెంకటేశ్వర ఉన్నత వేదాధ్యయన సంస్థ, హిందూ ధార్మిక సంస్థ ఆధ్వర్యంలో బుధవారం శ్రీనివాస రుక్ సహిత చతుర్వేద హవనం నిర్వహించారు. టీటీడీ వేద పండితులు వేద పారాయణ చేశారు.33 మంది రుత్విక్కులు, 60 మంది మహా పండితులు ఈ క్రతువు నిర్వహించారు.యాగశాల ప్రవేశం, రుత్విగ్వరణం, చతుర్వేద పురుష అవాహనం, అగ్ని ప్రతిష్ఠ నిర్వహించారు.సాయంత్రం ప్రముఖ సంగీత విద్వాంసుడు కె.సరస్వతీ ప్రసాద్ ఆధ్వర్యంలో అన్నమయ్య సంకీర్తనలు అలపించారు. నాలుగు రోజుల పాటు, రోజూ సాయంత్రం ఆరు నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు ఈ సంకీర్తనలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకుడు ఆకెళ్ల విభీషణ శర్మ చతుర్వేద హవనం వేదోక్తంగా నిర్వహించారన్నారు. దత్తాత్రేయ ఘనపాఠి, గుళ్లపల్లి శివశర్మ అవధాని, మహామహోపాధ్యాయ దోర్బల ప్రభాకరశర్మ, కంచి శ్రీకార్యం పర్యవేక్షణలో కార్యక్రమాలు నిర్వహించారు. కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతీ గురువారం కొవ్వూరు ఆంధ్రా గీర్వాణ విద్యాపీఠానికి విచ్చేయనున్నట్లు శ్రీశంకరాచార్య జగద్గురు సేవాసమితి ప్రతినిధులు తెలిపారు.3 నుంచి ఏడో తేదీ వరకు కళాశాలలో ప్రాంగణంలో త్రికాల పూజాదికాలు నిర్వహిస్తారన్నారు.4న గోష్పాదక్షేత్రంలో ధర్మజ్ఞాన కళావేదికలో శంకరాచార్య ఆరాధనోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

బాలుడి వైద్యానికి ప్రెస్ క్లబ్ ఆర్థిక సాయం

తాళ్లపూడి: పేదింటి బాలుడి వైద్య ఖర్చులకు బుధవారం తాళ్లపూడి ప్రెస్‌క్లబ్ రూ.10 వేల ఆర్థిక సాయం చేసింది. మండలంలోని తిరుగుడుమెట్టకు చెందిన గ్రామ వలంటీర్ సూరిశెట్టి చందు, పద్మ దంపతుల కుమారుడైన రభాన్వేష్ చేతి వేలు ప్రమాదంలో తెగి పడింది. ఈ క్రమంలో ఆ బాలుడి చేతికి ఆపరేషన్ చేయవలసి వచ్చింది. అయితే ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం. పరిస్థితి తెలుకుని స్పందించిన తాళ్లపూడి ప్రెస్ క్లబ్ కన్వీనర్ అప్పన రాజా, అధ్యక్షుడు జేవీ ప్రమోద్‌కుమార్, గౌరవాధ్యక్షుడు పరస రాధాకృష్ణల చేతుల మీదుగా బుధవారం ఆ కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. దాతలు ముందుకు వచ్చి బాలుడి వైద్య ఖర్చులకు సాయం అందజేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

మానవత చేయూత

మండలంలోని అన్నదేవరపేటకు చెందిన తాతా గంగరాజు అనే వ్యక్తి పక్షవాతంతో బాధపడుతున్నాడు. అతడి వైద్య ఖర్చుల నిమిత్తం మానవత స్వచ్ఛంద సంస్థ మండల శాఖ బుధవారం రూ.5,500 ఆర్థిక సాయం చేసింది. మానవత సంస్థ అధ్యక్షుడు జె. వెంకటేశ్వరరావు చేతుల మీదుగా ఈ మొత్తాన్ని గంగరాజుకు అందజేశారు. కార్యక్రమంలో మానవత సంస్థ సభ్యులు సీహెచ్ ఆంజనేయులు, బి.శంకర్, సాయన సుబ్బారావు, సనపల రాజశేఖర్, కె. రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

యాదవోలులో ధ్వజస్తంభాల ప్రతిష్ఠాపన

దేవరపల్లి: యాదవోలులోని మదన గోపాలస్వామి, లక్ష్మీగణపతి స్వామి వార్ల ఆలయాల వద్ద బుధవారం ధ్వజస్తంభాల ప్రతిష్ఠాన వైభవంగా జరిగింది. రెండు ఆలయాల వద్ద ఉదయం 7.30 గంటలకు జీవ ధ్వజ స్తంభాల ప్రతిష్ఠ నిర్వహించారు. పవన్‌సాయికుమార్, శ్రీరంగ సాయి సుధాకరాచార్యులు హోమాలు, పూజలు చేశారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, సర్పంచ్ సున్నం వరప్రసాద్, ఉప సర్పంచ్ ఆరేటి సూర్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కూచిపూడి సతీష్, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మేడిబోయిన గంగరాజు పాల్గొన్నారు. మదనగోపాలస్వామి వారిని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వెంకట్రావు, ఎంపీపీ దుర్గారావు, పార్టీ నాయకులను సత్కరించారు. మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించి పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు.

హోం మంత్రిని కలసిన వైఎస్సార్ సీపీ యూత్ జిల్లా అధ్యక్షుడు



మంత్రి తానేటి వనితకు పుష్పగుచ్ఛం అందించి, అభినందనలు తెలుపుతున్న చౌటుపల్లి వీరన్న

కొవ్వూరు: వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా ఇటీవల నియమితుడైన చౌటుపల్లి వీరన్న బుధవారం రాత్రి రాష్ట్ర హోం మంత్రి తానేటి వనితను కొవ్వూరులో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

నవధాన్యాల సాగుపై అవగాహన ర్యాలీ

దేవరపల్లి: ఖరీఫ్ సాగుకు ముందుగా నవ ధాన్యాలను సాగు చేయాలంటూ ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ విషయమై రైతులకు అవగాహన కల్పిస్తూ దేవరపల్లి జెడ్పీ హైస్కూలు విద్యార్థులు హైస్కూలు నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. రసాయన ఎరువులు వద్దు, సేంద్రియ ఎరువులు వాడాలి, నవ ధాన్యాలను సాగు చేసి భూసారాన్ని పెంచాలంటూ ఈ సందర్భంగా విద్యార్థులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కడిమి వీరకుమారి, వైఎస్సార్ సీపీ మండల సేవాదళ్ చైర్మన్ మాదవరపు వెంకటేశ్వరరావు, ప్రకృతి వ్యవసాయశాఖ ఎంటీ శ్రీనివాస్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పాలంగిలో కంటి వైద్య శిబిరం



శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఉండ్రాజవరం: మానవత స్వచ్ఛంద సంస్థ మండల శాఖ ఆధ్వర్యంలో పాలంగి గ్రామంలో బుధవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వేమగిరిలోని పరమహంస యోగానంద నేత్రాలయం నిపుణులు ఈ శిబిరంలో 180 మందికి కంటి పరీక్షలు చేశారు. వారిలో కళ్లజోళ్లు అవసరమైన 102 మందికి వాటిని పంపిణీ చేశారు. మరో ఎనిమిది మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వారికి యోగానంద నేత్ర వైద్యశాల ద్వారా ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు చేస్తారని మానవత స్వచ్ఛంద సంస్థ మండలశాఖ అధ్యక్షుడు ఎన్‌వీకే పాపారావు చెప్పారు. కార్యక్రమంలో మానవత సంస్థ సభ్యులు వెలిచేటి బోస్, అన్నె వెంకటేశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన పొగాకు ఉత్పత్తి చేయాలి

పొగాకు బోర్డు ఆర్ఎం జీఎల్‌కే ప్రసాద్



చెరుకుమిల్లిలో పొగాకు తోటను పరిశీలిస్తున్న పొగాకు బోర్డు, ఐటీసీ ప్రతినిధులు

గోపాలపురం: వర్జీనియా పొగాకు రైతులు నాణ్యమైన పొగాకును పండించాలని రాజమహేంద్రవరం పొగాకు బోర్డు రీజినల్ మేనేజర్ జీఎల్‌కే ప్రసాద్ సూచించారు. మండలంలోని చెరుకుమిల్లి గ్రామంలో పొగాకు తోటలను బుధవారం పొగాకు బోర్డు, ఐటీసీ ప్రతినిధులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్ఎం ప్రసాద్ మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్‌కు అనుగుణంగా రైతులు పొగాకును ఉత్పత్తి చేయాలన్నారు. ఐటీసీ మార్కెటింగ్ మేనేజర్ కె. యశ్వంత్‌కుమార్ మాట్లాడుతూ ఐటీసీ సంస్థ అనేక నూతన పొగాకు వంగడాలను ప్రవేశపెట్టిందని తెలిపారు. పొగాకులో పురుగు మందుల అవశేషాలు లేకుండా గ్రేడింగ్ నిర్వహించాలని రైతులకు సూచించారు. పొగాకు బోర్డు సిబ్బంది హెచ్ఓ శివశంకర్, రైతులు పిల్లి వెంకటేశ్వరరావు, ఆచంట సత్యనారాయణ, ముళ్లపూడి వివేక్ ఉన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్ ఫేర్‌లో మూడో బహుమతి

గోపాలపురం: రాష్ట్రస్థాయి విద్య వైజ్ఞానిక ప్రదర్శనలో స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థిని తృతీయ స్థానం సాధించినట్టు ప్రిన్సిపాల్ టి.ఉమాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 27, 28 తేదీల్లో విజయవాడలోని ఆంధ్రా లయోలా కళాశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో తమ విద్యార్థిని కొడవటి వినూత్న 'పేషెంట్ మానిటరింగ్ సిస్టం' అనే అంశంపై ప్రదర్శించిన నమూనా ప్రాజెక్ట్‌కు తృతీయ బహుమతి లభించినట్టు ఆమె తెలిపారు.

ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ

చాగల్లు: చంద్రవరం గ్రామంలోని ప్రధాన కూడలిలో వినాయక ఆలయ పునర్నిర్మాణానికి బుధవారం భూమి పూజ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు బండి అశోక్‌బాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. రోడ్డు విస్తరణలో భాగంగా ఇటీవల ఈ ఆలయాన్ని తొలగించారు. దాంతో గ్రామస్తుల సహకారంతో ఆలయాన్ని పునర్ నిర్మించినట్టు అశోక్‌బాబు తెలిపారు. సర్పంచ్ మద్దిపాటి శ్రీరామమూర్తి దంపతులు పూజలు చేశారు.